


# మల్లిపూలు

## బుచ్చిబాబు

### ఈనాటి పాఠకులకోసం ఒకనాటి ఆణిముత్యం

*ఇది బుచ్చిబాబు గారి మొట్టమొదటి కథానిక. ఈ వెర్షన్ ఎక్కడా ప్రచురించబడలేదు. దీన్నే కొంతకాలం తరువాత మరికొన్ని మార్పులు చేర్పులు చేసి ప్రచురణకిచ్చారాయన. ఆయన సతీమణి శ్రీమతి శివరాజు సుబ్బలక్ష్మి గారు కౌముదికోసం ఈ కథని ప్రత్యేకంగా అందించారు. వారికి 'కౌముది' కృతజ్ఞతలు తెలియచేస్తోంది.*



మూడేండ్లు గడిచేయి. జన సంచారం ఉన్నా అదొక తోటలాంటి ప్రదేశం. చెట్ల మధ్య కీచురాళ్ళు ధ్వనిస్తూ, ఆకాశంలో మేఘగర్జనాన్ని దిఃఖరిస్తున్నాయి.

"మల్లిపూలు, కోసి పెట్టవు, బావా?"

చాలా సంతోషంతో కోసి, ఆమె హస్తాల్లో ఉంచా.

"చీకటి పడేదాకా, కోస్తూనే ఉండు బావా; నువ్వు కోస్తే ఎక్కడా నలగడంలేదు, పైగా చెట్ల మీద పక్షులు, అలికిడికి పారిపోవడంలేదు. ఆఖరికి, ఆకులైనా కదల్లేదు. ఎంత గమ్మత్తుగా కోస్తావు బావా!"

పరీక్షలో దండయాత్రలు కొడుతున్నా, మల్లిపూలు 'గమ్మత్తు'గా కొయ్యడంలో ఇంత నేర్పు సంపాదించినందుకు, ఆమె చాలా ఆమోదించింది. నిజానికి, ఆమెకోసం, అల్లా కొయ్యడం తంటాలుపడి నేర్చుకున్నాను. ఆ నేర్చుకోవడంలోనే, పరీక్ష కూడా పోయిందని నా నమ్మకం. మళ్ళీ కొయ్యడం సాగించా. పొరబాటున బొటన వ్రేల్లో ముల్లు దిగింది. బాధ కలిగించకపోయినా, మానవ సహజమైన 'అబ్బ' అన్నాను.

కొంచెం ఖంగారుతో వచ్చి, ఆమె, నా చెయ్యి పట్టుకుని కళ్ళల్లోకి చూసింది.

"అబ్బ చాలా నెప్పిగా ఉందా బావా? పాపం" అంటూ వోణీ కొంగు చింపి, వ్రేలుకి కట్టింది. రాత్రింబవళ్ళు, నిద్రాహారాలు లేకుండా తల బాధ అనకుండా, బట్టలుతుక్కుంటూ, నీళ్ళుతోడుకుంటూ, దీపాలు తుడుచుకుంటూ, జ్వరం అనకుండా కష్టపడి చదివి పరీక్షకెళ్ళి ఫేలయితే ప్రతివాళ్ళు బూతులు తిట్టేవాళ్ళేకాని, (ఆఖరికి తల్లిదండ్రులు కూడా) వెధవ దోమంత ముల్లు దిగినంత మాత్రానికి, నన్ను ఆదరించి. జాలిచూపి, ధైర్యం చెప్పిన అమ్మాయిని, ఏంచెయ్యాలో తోచలేదు. మాటల కోసం తడుముకుంటుంటే

"వెధవపూలు" అని, పూలని మళ్ళీ విప్పి నలిపి గడ్డిలో పారేసి, 'రా బావా' అని చెప్పి చెయ్యట్టుకు తీసికెళ్ళి

కూర్చోబెట్టి, నా బొటనవేలు ఆమె నోట్లో పెట్టుకుంది. ఆ స్వేచ్ఛాభావం, స్వాతంత్రోల్లాసంతో, నవ్వుతుంటే ఆఖరికి హిమాలయా పర్వత శిఖరాలు కూడా విరిగి పడాలిసిందే

"పూలెందుకు పారేసావు?"

"నీ వేలు ఎందుకు తెగింది?"

"నా ఖర్మ."

"ఇది నా ఖర్మ"

అది వైరాగ్యం కాదు; విడ్డూరం కాదు

మరో మూడేండ్లు గడిచేయి. ఆ అమ్మాయి, ఏ ఊళ్ళో ఉన్నది తెలుసుకున్నా. కానీ, ఏంచేస్తూంది, ఎల్లా ఉన్నది, నేను ఊహించలేకపోయాను. నాకు, క్రొత్తగా, ఉద్యోగం ప్రాప్తించింది. కనుక చాలా సంతోషంతో నా స్వంత తోట్లో పువ్వులను కోసి, భద్రంగా బుట్టలో పెట్టి తీసి కెళ్ళి ఆ అమ్మాయికి బహుకరించి, నా స్నేహభావం వెలుపుచ్చుదామని బయలుదేరాను.

ఆమె, నాముందు నిలబడ్డది. మంచి ఎత్తరిగా మారింది. అంగ నిర్మాణం పూర్తయింది. కళ్ళు వికసించేయి. ముక్కు ఉంది పెదవులు మందార వకుళాలలాగా తీర్చబడ్డాయి. అంతకంటే అందంగ ఉండటానికి అవకాశంలేదు.

కాని ముఖంలో కళలేదు. కళ్ళల్లో తేజస్సు మొదలేలేదు. తల్లో పూలు లేవు. ముఖాన్ని బొట్టు లేదు. పెదవులు మీద చిరునగవూలేదు.

"ఇవిగో, నీకోసం మల్లి పూలు మా తోటలోవి"

"ఎందుకు బావా? ఈ పాడు జన్మకి మల్లిపూలెందుకు?

"నీకు చాలా ఇష్టంగా... అందులో"

"కాని, ఎప్పుడైనా, ఒకనాడైనా ధరించానా పూలని? నా జీవితంలో, మల్లెపువ్వు వికాశం ఇంక లేదు. పెండ్లి కావడం, విధవనవడం, జరిగిపోయాయి. ఇంకెక్కడి మల్లిపూలు."

రెండు కళ్ళల్లోంచి రెండు అశ్రుబిందువులు రాలి, నేలమీద పడి చప్పుడు కూడా చేసాయి.

"ఖర్మఫలం"

"అవును

బావా పూర్వం మూడేండ్ల క్రితం తోటలోనే, చెప్పాగా, "ఖర్మ" అని.

నేను మళ్ళీ మామూలుగా మాటల కోసం తడుముకుంటున్నా.

"పదేండ్లప్పుడే మన స్నేహం, నా హృదయంలో నాటుకుపోయింది బావా. మూడేండ్ల క్రితం నా ప్రేమ కాస్తా నిఘూఢంగా తెలియపర్చాను. నువ్వు గ్రహించి, నాకోసం, ప్రయత్నించలేకపొయ్యావు. స్త్రీని, నేను అంతకంటే, వెలిబుచ్చలేను మన ఖర్మ ఫలం..."

నాకు ఆశ్చర్యం. దుఃఖం కూడా కలిగాయి.

"సంఘం, క్రూర స్వభావం దాలుస్తుంది బావా మన వివాహాన్ని వొప్పదు. మన ప్రేమని అసలే గౌరవించదు. కాని మన జీవితాలు రెండూ, మల్లిపూలచే బంధించబడ్డాయి. మల్లి పూల చేతనే వేరుచేయపడ్డాయి. మల్లిపూలు ఏనాడు పుష్పించడం మాన్తాయో, ఆనాడు నిన్ను మరచిపోతాను...."

నేనా దృశ్యం చూడలేకపోయాను. రెండు కళ్ళల్లోంచి, రెండు అశ్రుకణాలు రాలేయి. కానీ శబ్దం మాత్రం చెయ్యలేదు.

తెల్లారి లేచేప్పటికి నాముందరున్న, బుట్టెడి మల్లిపూలు, తడిసిపోయాయి. కంటిధారచే కాబోలు. మల్లి పూలు నోరు విప్పి మాట్లాడాయి కూడాను.

"నీ విజ్ఞానం, నీ గంభీరం, నీ ఔదార్యం నీబ్రతుకు తెరువు, నిష్ప్రయోజనం తుదకి మల్లిపూలకి కూడా, ఆనందం సమకూర్చలేకపోయావు. "